విశ్వనాథవారి నవలాసృష్టి

# "చెలియలి కట్ట:" ఒక సమీక్ష

పి. శ్రీదేవి

సాధారణముగా నొక నవలను చదువునపుడు చదువరి నాకర్షించు ప్రధాన విషయములు నాలుగు· ఇతివృత్తము, శిల్పము, పాత్రపోషణ, భావౌచిత్యము. ఒక్కొక్క రచనలో నొక్కొక్క విషయము ఎక్కువ ఆకర్షించును. 'విశ్వనాథవారి' చెలియలికట్ట భావౌచిత్యము ప్రధానముగా గల నవల.

ఇతివృత్తము: సామాన్యమైనది. ఇతివృత్తములో నేమియు నొడుదుడుకులులేవు. తీవ్రత లేదు. చమత్కారము లేదు. తాత్కాలికమైన ఒకానొక ఉద్రేకమునకు లేదా వాంఛకు లోనై సంసారము త్యజించి వచ్చుట-పతితయై పరితాప మందుట విరక్తిచే నాత్మహత్య చేసికొనుట సామాన్య సంఘటనలే.

ఇతివృత్తము సాంఘికము. పాత్రలు సాంఘికములు. లక్ష్యము సంఘజీవనమునకును వ్యక్తి జీవితమునకును సంబందించినది. అందుచేత నీ నవలలో నసాధారణ వైచిత్రి ఏమియులేదు.

శిల్పము: ఇది తదితరములైన పాత్రోన్మీలనము, భావౌచిత్యము మొదలైన గుణములతో కూడినది. ఇందలి శిల్పమును గూర్చి ప్రత్యేకముగా విడదీసి చెప్పదగిన విషయము కనబడదు.

సంభాషణల భాష వ్యవహారికము. వర్ణనాశిల్పమంతగా లేదు.

గ్రంథములో సంభాషణల కంటె ఇతివృత్త విస్తరణ కంటె తర్కమెక్కువ. చర్చ ఎక్కువ. మీమాంస హెచ్చు. భావన యత్యధికము. కాని ఆ తర్కము, ఆ చర్చ చదువరికి విసుగు పుట్టించవు. కారణము ఆ తర్కమును పెంపొందించిన వైఖరి, ఆ తర్కములో నిమిడియున్న లక్ష్యమంత బలమైనవి.

చదువరి ఈ గ్రంథమును 'చివరికీ కథ ఎట్లు ముగియును,' అని చదువడు. అందులోని మీమాంసల యంతు తెలిసికొనుట కుత్సాహముతో చదువును. ఉదాహరణకు "ప్రేమయనగా నేమి?" అను మీమాంస మొదటి ప్రకరణములోనే కల్గును. దానినిగూర్చి రంగారావు రత్నావళుల మధ్య చాల చర్చ జరిగినది. ప్రేమను గూర్చి రంగారావు ఊహ వేరు రత్నావళి యభిప్రాయము వేరు. చివరికీ రచన ద్వారా ఏమి నిరూపింవబడినది అని తెలిసికొనవలెననెడి ఉత్సాహము మనలను ముందుకు నడిపించును. ఇట్లే ఇందనేక విషయము లున్నవి.

ఇతివృత్తమునకు సంబంధించని ఉపకదలు, అనవసరపు సంఘటనలు, ఉపపాత్రలు, ఇందులో లేవు.

పాత్రపోషణ: ఇందు పది పదునొకండు పాత్రలు గలవు. ప్రధాన పాత్రలనదగినవి రంగారావు రత్నావళియునైనను, మిగిలినపాత్రలన్నియుకూడ నొక్కస్థాయిలో పోషింపబడుచు వచ్చినవి. కాని అన్నిటిలో నుదాత్తమైన పాత్ర సీతారామయ్యది. సీతారామయ్యను గూర్చి చదువునపుడు చేయెత్తి నమస్కరింపవలెనన్నంత గౌరవ భావము, సానుభూతియు కల్గును. నిజమునకు రత్నావళి, రంగారావు, నితివృత్తములో నెక్కువ భాగమాక్రమించుకొనినవారైనను సీతారామయ్యయే వెనుకనుండి కద నడిపించుచున్నటుల తోచును. రచయిత వ్యక్తపరచదలచుకొనిన విషయమంతయు రత్నావళితోడనే యున్నది. కాని ఆ విషయమునకు త్రోవచూపినవాడు సీతారామయ్య. సీతారామయ్య మచ్చునకైన మచ్చలేని మంచి వ్యక్తి. ఆతని శాంతము, ఆతని ఔదార్యము, ఆతని జాలిగుండె, అతని క్షమాబుద్ధియే, రత్నావళి మనసులో దీపవువెలుగై ఆమెలో విద్యా

వివేక సంస్కారములను, పశ్చాత్తాపమును, కలిగించినవి. అవియే ఆమెను తిరిగి ఆతని పాదముల కడకు కొనిపోయినవి.

రత్నావళి ఆకర్షణీయమైన పాత్ర. కాని గ్రంథము ముగియులోపున ఆమె స్వరూపము పలువిధముల మనకు గోచరించును.

ముగ్ధయు, నమాయికురాలును, సామాన్య సంసారపు క్రొత్త కోడలును, వయసుమీరిన భర్తకనుంగు భార్యయునైన రత్నావళినే తరువాత యౌవన మదోన్మాదిగా, కాముకిగా విశృంఖల చిత్తవృత్తి కలదిగా చూతుము. మరికొంత గడచునప్పటి కామెలో తర్కము వాదనా పటిమ, ఉచితానుచిత విచక్షణా జ్ఞానము, సత్యాన్వేషణా లక్ష్యము, గోచరించును. క్రొత్త వ్యక్తుల పరిచయముతో క్రొత్తయనుభూతులామెలో నెక్కడో దాగియున్న వివేకము సంస్కారములను వెలికిదెచ్చి, ఆమెను సన్మార్గగామిగా, విదుషిగా చేయును. విదుషి, వివేకవతి, పరితప్తహృదయయైన యామె ధర్మమును తెలిసికొనినది. శరీరమును త్యజించినది.

రత్నావళి చెడిపోవుటలో నాశ్చర్యములేదు. చెడిపోయిన వ్యక్తి పశ్చాత్తాపముచే క్రుంగిపోవుటకూడ విచిత్రముకాదు ఆ పశ్చాత్తాపము కల్గుట కింత వివేకము, సంస్కారము, అనవసరము. పశ్చాత్తాపము కల్గుట కనుభవము మాత్రము చాలును. కాని రత్నావళి విషయములో నిది సాధారణమైన పశ్చాత్తాపముకాదు. సంస్కారముతో కూడిన వివేకము, వివేకముతో కూడిన పశ్చాత్తాపము. ఆ పశ్చాత్తాపమంతటితో నాగిపోలేదు. అది ఆమెలో ధర్మమును నిలిపినది. ఇది ఈ పాత్రలోని విశేషగుణము.

రత్నావళిలో వివిధమైన మార్పులు కలుగుటకు తగు వాతావరణమంతయు నేర్పుతో చిత్రింపబడినది. కాని ఆ మార్పుయొక్క గమనము। కొన్ని చోట్ల త్వరితగతిని పొందినటుల తోచును. అట్టి సమయముల వాస్తవికతకు భంగము కల్గినది.

రత్నావళి సహజముగా నమాయిక సామాన్య సంసారుల యింట బుట్టినది. శిష్టాచార పరాయణులైన సద్బ్రాహ్మణ వంశమున కోడలుగా మనుచున్నది. ఆమె కప్పటికి పదునేను వత్సరములు. అప్పటికే రెండు సంవత్సరము లైనవి ఆమె కాపురమునకు వచ్చి. భార్యాభర్తలు సుఖముగనే యున్నారు. ఆధునిక సంస్కారపు వాసనలు కూడ తగులుటకు వీలులేని వాతావరణమే అప్పటి వరకామె ప్రపంచము. అట్టి స్థితిలో రంగారావు ఆమెలో క్రొత్త ఆలోచనలను రేకెత్తించెను. క్రొత్త కోరికలను పుట్టించెను. ఆమె క్రొత్త పోకడలు పోయినది. కాని రంగారావు మొట్ట మొదటిసారి రత్నావళిని కలుసుకొనిన సమయమెట్టిది? అర్ధరాత్రి. ఇంటిలో నందరు నిద్రపోవుచుండిరి. అతడు గోడదూకి రత్నావళి గదిలో ప్రవేశించెను. అట్టితరి రత్నావళి సహజముగా నేమి చేయును? భయముతో పెద్ద గోలచేయుటయో లేదా భయ విహ్వలయై నోటమాట రానిదగుటయో సంభవించును. కాని "మరది కనిపించెను ఆమె తహ తహలాడెను" అనిమాత్రమే వచింపబడినది.

రంగారావు "భయపడకు నేను నీతో కొన్ని సంగతులు మాట్లాడదామని వచ్చాను" అనినపుడు వెంటనే రత్నావళి 'ఏమి మాట్లాడుతారు' అని ప్రశ్నించెను. ఆమె విహ్వల చిత్తయైనచో వెంటనే అట్లు ప్రశ్నించలేదు. అనగా నామె తన మనసును పూర్తి స్వాధీనములో నుంచుకొనినట్లు తోచును.

తరువాత రంగారావు (23 వ పేజీలో) "మా అన్నయ్య వయసుమీరినవాడు....మా అన్నయ్యకేమీ చదువురాదు....ఆయన అందగాడుకాదు. ..తలా గడ్డమూ పెంచి బూచిలా వుంటాడు" అని తన అన్నగారిని గూర్చి దూషణ చేయునపుడు రత్నావళి 'మారు మాటాడలేదు. ఆలోచించుచు నిల్చున్నది' అని యున్నది. అట్టి అర్ధరాత్రి తలవని తలంపుగ తనతో నంతవరకు నెక్కువ పరిచయము లేని తన మరదివచ్చి తన భర్తను గూర్చి దూషణచేయునపుడు ముందుగా నామె అతనిని వారించు నాసక్తి చూపుట సహజమని తోచుచున్నది. రత్నావళికి అంతకు పూర్వము భర్తను గూర్చి ఎట్టి అసంతృప్తిగాని దురభిప్రాయముగాని యున్నటుల సూచింపబడలేదు.

రంగారావు తన భర్తను దూషించుచుండ సహించి యూరకుండుట ఆమె సహజముగనే భర్తను ద్వేషించుచున్నదేమోయను సందేహమునకు తావొసంగుచున్నది. రంగారావుచెప్పిన మాటలను ఆమె అజ్ఞాతముగా నంగీకరించుచున్నటులతోచును. ఇది ఆమె మానసిక ప్రవృత్తిని గూర్చి విపరీతార్థము కల్పించుచున్నది. ఆమె పెరిగిన వాతావరణమునకు ఈ మొదటి సంఘటన ఆమెలో కల్గించిన ప్రతీకారము అంత సహజముగ తోచుటలేదు.

రంగారావు లక్నోనుండి తిరిగివచ్చినపిమ్మట సీతారామయ్య గ్రామములో లేనపుడు రంగారావు రత్నావళియు సాయంవాహ్యాళికి సముద్రమునకు పోవుదురు. అప్పటికే రత్నావళిలో చాలమార్పు వచ్చినమాట వాస్తవమే. కాని అంతమాత్రమున అంత కుగ్రామములో వాహ్యాళికి పోవుటకు సాహసించునా! వ్యక్తిగతముగా నెంతమార్పు వచ్చినను పరిసర వాతావరణమును విడిచిపెట్టకుండగనే పరపురుషునితో స్వేచ్ఛగా వాహ్యాళికి పోవునంతటి సాహసము ఆడుదైన రత్నావళిలో కల్గుట అత్యుక్తిగానున్నది.

రత్నావళి మద్రాసునకు పోయినదిమొదలు చివరివరకు నామెపాత్ర చక్కగా నడచినది. ఆమె యొక తప్పుపని చేసినదైనను ఆమెలో నంతకంతకు విస్తృతమగుచున్న వివేకము విచక్షణా జ్ఞానము చదువరి సానుభూతిని పెంపొందించుకొనును.

రంగారావు—ఈత డింట నిప్పుపెట్టి ఇతరులను రక్షింపబోవు ధైర్యశాలి. సంస్కారరహితమైన చదువు, ప్రాపంచికానుభవములేని వివేకము, మిడిమిడి జ్ఞానముతోకూడిన వ్యర్థసిద్ధాంతములు, అనుభూతిలేని ఆలోచనలు, వైదేశిక సంప్రదాయ వ్యామోహమున క్రొత్త ప్రపంచమును సృష్టింపదలచిన ఉద్రేకము, అదుపులోలేని వయసు, అతనిని వంచితుని చేసినవి. అతడు నిస్సహాయుడైనాడు. రత్నావళి నతడంటిపెట్టుకొని యుండుటకు కారణమాతని నిస్సహాయమే. తనను తాను పూర్తిగా వంచించుకొనగల బలహీనతయే యాతనిలోని ప్రధానగుణము.

సరస్వతి మొత్తము గ్రంథములో చాల తక్కువభాగ మాక్రమించుకొనిన పాత్ర. ఆమె చాల తక్కువ మాట్లాడినది. కాని ఆ తక్కువలో నెక్కువ విషయమును చెప్పినది. ఆ చెప్పుటలో నిర్దుష్టమైన వ్యాఖ్యానమున్నది. రత్నావళి భర్తను కొట్టినపుడామె రత్నావళికి 'ఎవరికేది ప్రాప్తమో వారికది లభించును' అను హిందూ తాత్వికసిద్ధాంతమును సోదాహరణముగా వివరించిన విధానము మిక్కిలి వివేకముతో కూడినది అనుభవముతోకూడిన వివేకమామెది. ఆమె ఎక్కువ చదువుకొనినదికాదు. రంగారావువంటివారి దృష్టిలో నామె సంస్కారము కలదియునుకాదు. కాని ఆమెలో నిజమైన సంస్కారము కలదు ఆమె మాటలలో నామె స్వరూపము పూర్తిగా గోచరించును. రత్నావళి ఎంత పెద్దదోవ ద్రొక్కినదైనను ఆమె చెప్పినపుడు వదినెగారు చెప్పిన మాటలన్నియు నిజమేమో అనుకొనెను. రంగారావు ఎవ్వరికిని భయపడడు. కాని సరస్వతికి భయపడును. కారణ మామెలోని ఆ వివేక మాతని నోడించగలదను భయమే.

రంగారావు స్నేహితులు నల్గురును నాల్గు రకముల మనఃప్రవృత్తులు కలవారు. రత్నావళి తనమార్గమును సరిదిద్దుకొనుటకు వారొక్కరొక్కరొక్క విధముగా తోడ్పడిరి అందులో ముకుందరావొక విలక్షణమైన పాత్ర అతడామె నొకవిధముగా నాకర్షించెను. అతనిచే నందరు ఆకర్షించబడుదురు

చెలియలి కట్ట మూలముగా రచయిత చెప్ప దలచుకొనిన దేమి?

సంప్రదాయము ధర్మమును కాపాడును. సంప్రదాయ విరుద్ధమైన ఆచరణ ధర్మమునకు దూరము చేయును. దేశీయమైన సంప్రదాయము, ఒక కట్టుబాటు, లేనినాడు ధర్మమునకు ఎట్టి విచ్ఛిత్తి కల్గునో చాటి చెప్పుట ఇందలి లక్ష్యము. సాధారణముగా వీరి రచనలన్నిటియందు నీ భావమే ప్రతిఫలించుచుం

డును. కాని ఈ గ్రంథమునందా భావమే విస్తృతమై విశ్వరూపము దాల్చినది.

సంఘములోని వ్యక్తి సంప్రదాయమును త్యజించుట సముద్రుడు చెలియలి కట్టను దాటి వచ్చునంతటి విపత్కరమైనది.

ఆ విపత్తు ఎట్టిది?

అగ్ని కావర్తమై హాలహలాము లేచి
కృత్తికా మూర్తివలె బిట్టు కురలి మఱల
దాటి యెత్తున భీషణోద్ధతిని బొలిచె
......................
......................
ప్రళయ కాల మహోగ్ర విభావరీ మ
హా ఝురీ పాత ఘోరనది జరాబి
వారి ధారా విధంబున వచ్చి వచ్చి
హద్దులను ద్రెంచి పూర్వ మర్యాద ఉరలి
బద్దెలను దాటి ధర్మసంబంధ మొడలి
నిర్దయ స్వాంతమగు వారినిథికి ఘోర
కర్దమా భీల జలపాతకంబు లేచి.

రంగారావు రత్నావళిలో 'ఇది సోదర సోదరీ భావము' అనుచు నామెను కౌగలించుకొనెను. కాని ఆ కౌగిలి ఎట్టి ప్రమాదమును తెచ్చి పెట్టినది. వా రిరువురి యెదలలో నెట్టి విచిత్ర సంచలనము కల్గించినది.

అందుకే.

''చెలియలి కట్టదాక సముద్రుడు చన
డు. చెలియలి కట్ట ముట్టుకోడు. చెలి యలిని
ముట్టుకొందురా'—అనినారు.
''తదీయ హృదయమేదియో యొకండు
ధర్మ మావరించెను తీవ్ర ధర్మ మతని
గట్టివేసెను........''

లేనిచో—

'ధాత్రి బహుతరా లీఢ ఘోర
వారీ ధారా ప్రపాత ఘూర్ణోరు జలము
యంచుగా సస్యములు బీడులై జనములు
శవములై ప్రేతభావంబు సాగుదెంచి
కాళరాత్రి మహానాట్య ఝునకరాళ
తీవ్ర భీభత్స రూపంబు తిరిగిరాదో!''

ఈ విపరీత పరిణామ మెట్టిదో రంగారావు రత్నావళుల జీవితము చాటిచెప్పుచున్నవి.

వివాహము, ప్రేమ, సౌందర్యము, మొదలగు విషయములనుగూర్చి నిందులో సుదీర్ఘమైన చర్చ యున్నది. రంగారావు ప్రేమ, వివాహము, వీనికిగల సంబంధమును గూర్చి రత్నావళిలో విపరీతాభిప్రాయములు కల్గించెను. కాని రత్నావళి ఆ అభిప్రాయములతో కొట్టుకొనిపోలేదు.

హిందూ దేశము కర్మ భూమి. హిందువు డైనవాడు కర్మ నిష్ఠాపరుడై యుండవలెను. అట్టి వ్యక్తికి కేవలమైహికము ప్రధానముకాదు ఆధ్యాత్మిక చింతన యవసరము. జీవితములో నిహపరచింతనలను సమన్వయపరచునది గృహస్థాశ్రమము. అట్టిదానికి హేతువు వివాహము. ''వివాహము అనగా విశేషముగా వహించునదియని అర్థము. విశేషముగాననగా నైహికముగా మాత్రముగాక పారలౌకికముగా కూడనని యర్థము'' (201 వ పేజీ)—ఇది స్థూలముగా రత్నావళినుండి తెలిసికొనదగు సత్యము. అందుచేతనే చివరిఘట్టమున రత్నావళిలో కలిగిన సంచలనమంతయుదాత్తమైనది. ఆమె సీతారామయ్య కొరకున్మాదినివలె నడచి పోయినది. ఆమె యతనిని క్షమింప మనుటకు పోలేదు. తిరిగి స్వీకరింపుమనుటకు పోలేదు. ఆమె కోరిక వీటినన్నిటి నధిగమించినది. వీనికతీతమైనది.

ఆమె తనకు తానై యొక తప్పుచేసినది. అట్టిదాని ఫలితముగా నామె ధర్మచ్యుతురాలైనది. అపవిత్రయైనది తన సతీత్వమును కోల్పోయినది కేవల పశ్చాత్తాపముచేతను, క్షమాభిక్ష కోరుట మాత్రముచేతను, ఆమె పవిత్రురాలు కాలేదని తెలిసికొనినది. పారలౌకిక చింతన యొక్కటియే తనను తరింపచేయునను జ్ఞానమామెకు కలిగినది. ఆమె తాత్వికురాలైనది. కనుకనే ''నీ కుమారునిచే ధర్మముగా తద్దినము పెట్టింపు''మని కోరినది. రత్నావళి యెంతటి పతనావస్థనుండి ఎట్టి పరిపక్వ స్థితికి వచ్చినది?

సీతారామయ్య చాల ఉదారుడు; క్షమాబుది

కలవాడునని రత్నావళికి తెలియును. అయినచో నామె సీతారామయ్యచే క్షమింపబడి శేష జీవితము నాతని సేవలో గడపవచ్చును కదా. ఆమె చనిపోవు నంతటి యవసరమేమి యని సందేహము కల్గును.

ఆ సందేహమును రచయితయే నీలాంబరుడు రంగారావుతో వెలిబుచ్చిన ధర్మసందేహముగా చెప్పించిరి.

"ఒక భార్య భర్తను వదలిపెట్టిపోయెను. ఆమె తరువాత పశ్చాత్తాపపడి మఱల భర్త వద్దకు పోయి తనను స్వీకరింపు మనెను. అతడు స్వీకరించవలయునా? లేదా" (274వ పేజీ)

రంగారావునకు దానికి జవాబు చెప్పగల శక్తిలేదు. అతనికి ధర్మమునుగూర్చిన జ్ఞానము లేదు-విశ్వాసమును లేదు. కనుక నాతడు ఆ ప్రశ్న రత్నావళినే యడిగెను. ఆమె దానికి చక్కగా తీర్పు చెప్పెను. (280వ పేజీలో)

రంగారావునకు చిత్తశుద్ధి లేదు. రత్నావళిలో కల్గినట్టి జ్ఞాన మాతనియం దుదయించ లేదు. అతని సిద్ధాంతము లాతనికే బెడిసికొట్టినవి. అతడు బలహీనుడైనాడు. ఒక జడ పదార్థము వలె నాతడు రత్నావళి వెనువెంటనే బయలు దేరినాడు.

రత్నావళి తుపానులను కూడా లక్ష్యము చేయని ఒకానొక తీవ్రబుద్ధితో ప్రతిష్ఠాపురము బయలుదేరినది. త్రోవలో నట్టి తుపానులో హరికిశోరుడు ముకుందరావు కన్పించిన యవసర యర్థము కాలేదు. వారి సహాయము లేక పోయినను ఆమె ఎట్లో ప్రతిష్ఠాపురము చేరుకొన గల్గెడిదే. ముకుందరా వామెతో తాను ప్రతిష్ఠాపురము నుండియే వచ్చుచున్నానని చెప్పెను. అతనికి ఆ గ్రామముతోగల నంబంధ మేమో తెలియదు.

పుస్తక మంతయు చదివిన పిమ్మట మరి యొక అనుమానము కల్గును. రచయిత దేశీయ సంప్రదాయముల నెంత ఆదరించిన వారైనను ఎంత ధర్మసంస్థాపనాభిలాషియైనను వయో తారతమ్యమును గుర్తించని వివాహములను ప్రోత్సహించుచున్నారా యని.

ఈ విషయమై అనేక రీతుల విమర్శనాపూర్వక వ్యాఖ్యానములను వాచ్యముగా విని యుంటిని. కాని చదువరులకు పైన వివరించినట్టి అపోహ కల్గుటకు తగు కారణము లేక పోలేదు.

నలుబది వత్సరముల వయస్సుగల సీతారామయ్య పదునేను సంవత్సరముల రత్నావళిని వివాహమాడెను. ఇదియే తరువాత జరిగిన సంఘటనలకు పునాదియైనది. వయసు మీరిన అన్నగారు బాలికయైన రత్నావళిని పెండ్లి చేసికొని యన్యాయము చేసినా డను భారము రంగనిలో తీవ్రరూపము దాల్చినది. రంగని యుద్బోధముచే రత్నావళి కూడ తన కన్యాయము జరిగినదవి వయసు మీరిన భర్తవలన తా నానందము పొందలే ననియు భావించినదై రంగనితో మద్రాసు పోయినది. కాని మద్రాసుపోయిన నెలదినములలోనే ఆమె రంగనితోడి సావాసము కంటె సీతారామయ్య తోడి దాంపత్యమే ఎక్కువతృప్తి నిచ్చినదను విషయమును గ్రహించినది. క్రమక్రమముగా ఆ విషయమునే ఆమె పలు చోట్ల స్పష్టము చేసినది. ఇందుమూలముగ వైవాహిక జీవితములో తృప్తి కేవలము కామతృష్ణచే కలుగునదికాదు. దాంపత్యధర్మము నర్థముచేసుకొనుటలో యున్నది. అని రచయిత ఉద్బోధించుచున్నారు.

రత్నావళి సంసారమును వదలివచ్చిన పిమ్మట సీతారామయ్య తిరిగి వివాహము చేసికొనెను. ఇదియే పై నుదహరించిన సందేహమును బలపరచుచున్నది

ఇచ్చట ఒక్కవిషయము గమనించ దగినది. పురుషుడు ఒకభార్య బ్రతికియుండగనే సంతానార్థమైగాని కళత్రలోపము కలిగిననాడు కాని తిరిగి వివాహము చేసికొనుట మనసంప్రదాయములో చిరకాలమునుండి యున్నదే— కేవల లౌకిక వ్యామోహములచే బహుభార్యాత్వమును కలదు కాని అట్టిదానిని సమాజము గర్హించును.

సమాజములో ఈ సంప్రదాయమును గూర్చి రకరకములైన తర్జనభర్జనలు జరుగు

చున్నవి. వయసులోనున్న పురుషుడు పునర్వివాహము చేసికొనుట నెవ్వరూ ఆక్షేపించరు- కాని వయసు పైబడిన పురుషుడు తనకంటె చాలా చిన్నదియగు నొక బాలికను వివాహమాడుట సమాజపుదృష్టిలో గర్హించదగినది. ఇప్పటికినీ అట్టి వివాహములు జరుగకపోలేదు. అయిన రచయిత అట్టి వివాహమును సమర్థించినారే. సీతారామయ్య తిరిగి తిరిగి వివాహమాడుటలోని ఔచిత్య మెట్టిది. అట్టి వివాహపు ఫలితముగనేకదా రత్నావళి పెడదారి త్రొక్కినది. తిరిగి మరియొక బాలికను ఉచ్చులోనికి లాగుట ఎందులకు!

"వయసులో నేమున్నది—ఆశ్లేయ పౌరుషేయములో నున్నది కాని" అని రత్నావళి మేనమామ రత్నావళిని సీతారామయ్య కిచ్చెనట.

రైలులోని వృద్ధుడు రత్నావళితో తనకూతురును సీతారామయ్య కిచ్చుటనుగూర్చి చెప్పిన విధానము చాల చమత్కార మైనది. (146 వ పేజీ—)

"మా యల్లునకు నలువది యైదేండ్లుండును. మూడవ సంబంధ మిచ్చితిని....గీత బాగుగా నుండవలయుగాని కొంచె మేండ్ల తారతమ్యములో నేమున్నది? నాపిల్ల నరువది యేండ్ల వృద్ధున కీయలేదు. మగవాండ్రకరువదియేండ్లవరకు వయ సుండును. స్త్రీలకు నలుబదియేండ్లతో వయసు దిగిపోవును. ఈ తారతమ్యమును చూచి యిచ్చితి" ననెను.

అనగా స్త్రీ పురుషుల సహజ శారీరక ప్రకృతికి కొంత ప్రాధాన్య మిచ్చి రచయిత ఆ వివాహమును సమర్థించినారు.

సరస్వతిని వృద్ధున కీయలేదు. అయినను ఆమె వైధవ్యమును భవించినది. ఆ యనుభవమామెచే ఎవరి కేది ప్రాప్తమో అది యనుభవింతుము. మన చేతిలో నేమియు లేదు అను తాత్త్విక బోధ చేయించినది.

ఈ రీతిగా రచయిత ఎక్కడికక్కడ తాను నిర్దేశించిన భావమును చమత్కారముగా సమర్థించినారు.

సనాతనధర్మము, సంప్రదాయము, సంఘము; వ్యక్తిజీవితము, పట్ల రచయిత దృష్టి వేరు. వారి దృష్టి ఆధ్యాత్మికము. మానవ జీవితములోని లౌకిక వ్యవహారము లన్నిటికి అట్టడుగున ఒక ధర్మము, ఒక పారలౌకిక చింతన యున్నదని, అది అవసరమని ఆ ధర్మము నశించిననాడు సమాజమునకే నాశనము వాటిల్లునని వారి విశ్వాసము. వారి రచన లన్నియు ఆ విశ్వాసమునే ప్రస్ఫుటము చేయును.

అందుచేతనే 'వివాహము' అనుదానికి వారు చెప్పు అర్థము లౌకిక సత్యమునకు భిన్నమైనది. ఈనాడు కేవల జీవితావసరముగా ఒక ఉదాత్తానుభవముగా సృష్టి సామాన్య లక్షణమును పరిగణింపబడుచున్న వివాహమునకు వారు చెప్పిన యర్థము.

"వివాహమనగా విశేషముగా వహించునది" "చనిపోయిన తరువాత మనము కాబోవు మార్పులకు సానుకూల పడుటకు నీ జన్మములో కొన్ని కార్యములు చేయవలసియుండును, అట్టి కార్యములు స్త్రీ పురుషులు కలిసి దంపతులుగా నేర్పడి యిచ్చుట చేయుదురు" (201 వ పేజీ) అని రత్నావళి వివరించినది.

ఇదియే ఈ రచనకు తల్లివేరు. దానిపై నాధారపడి యితివృత్త మంతయు నిలచి యున్నది.

రచయిత ఆదర్శములు, అభిప్రాయములను గూర్చిన చర్చ యిచ్చట యవసరము. కాని వారు నిర్దేశించిన విషయమును నిర్దుష్టముగా చెప్పుటలో, స్పష్టము చేయుటలో, సమర్థించుటలోని చమత్కారము గమనింపదగినది.

* * *

ఇతివృత్తమును గూర్చి మరియొక సందేహము కలదు. రచయిత తాను నిరూపించదలచుకొనిన లక్ష్యమును సాధించుటకు రంగారావువంటి ఒక వ్యక్తియు రత్నావళివంటి స్త్రీయు నవసరమైరి. కాని వారిరువురును మరది వదినెలు కానక్కరలేదు.

హిందూ సంప్రదాయములో అన్నభార్యకు మాతృస్థాన మీబడినది. మిక్కిలి నీచబుద్ధి కల వాడుకాని అట్టి మాతృస్థాన మీదగిన వదినె గారితో సంచరించుటకు సిద్ధపడడు. మరి రంగా రావు అట్టి నీచబుద్ధియా! రంగారావు ధర్మము నధిగమించెననుటకు ఆతడు తన వదినెగారినే లేవదీసికొని పోనక్కరలేదు. వివాహితయైన మరి ఏ యితర స్త్రీయైనను చాలును కదా!

నీచాతి నీచమగు నట్టి పాపమును చేసిన రంగారావు ఇతివృత్తమునకు నాయకుడనదగిన ప్రధానపాత్ర కదా! కావ్య వస్తువునకు నీచ పాత్రను ప్రధానముగా తీసికొనుట సాధార ణౌచితికాదు. మరి యిట్టివస్తు వెందులకు తీసి కొనబడినది?

అసలు రంగారావునకు వదినెగారిని లేవదీసి కొనిపోవు తలంపులేదు. తనకు అన్వయించని కొన్ని వింత సిద్ధాంతములను పూర్తిగా విశ్వ సించి వాని నాచరింపబోయినాడు. తన సిద్ధాం తములతో ఆమెను రక్షింపబోయినాడు. ఆ రక్షింపబోవుటలో తనకు తెలియకుండగనే తన పరిధులను దాటినాడు.

''చెలియని కట్టదాక సముద్రుడు చనడు. చెలియలి కట్టను ముట్టుకోడు.'' కాని ముట్టు కొనినచో—ఆ కట్టను దాటినచో నేమగునో-అది ఊహకందని ప్రళయము. అట్లే రంగారావు తన సిద్ధాంతములను నమ్మి పాశ్చాత్య సంప్ర దాయ ప్రకారము నిందులో తప్పులేదనుచు రత్నావళిని కౌగిలించెను. ఇచ్చట వారిద్దరి మనస్తత్వములు వేర్వేరుగా నున్నవి. రంగా రావునకు తన సిద్ధాంతములే తెలియునుకాని అట్టివానిని ఆచరించుటయందనుభవములేదు. రత్నావళికి ఆ సిద్ధాంతములేమో తెలియవుకాని పురుషుని కౌగిలింతలోని యనుభవము మాత్రము తెలియును. అందుచేతనే రంగారావా మెను కౌగలించినపుడు ఆ తాకిడి వానిలోనొక తెలియని ఉద్వేగము, ఆమెలోనొక పరిచిత మైన తెలిసిన ఉద్వేగము కలిగించినవి. కనుక నాతనికి తెలియకుండగనే ఆతడామెను చెరచి నాడు.

మరది వదినెగారిని చెరచెనన్నంతటి నీచ మున కొడుగట్టిననుట చదువరికి ఒక అఘా త్యమువలె తగులును. అదియొక యనన్య సామాన్యమైన బాధను కల్గించును. చదువరి అట్టి బాధ ననుభవించినపుడే 'హద్దులను దాటి, పూర్వ మర్యాదలురలి, బద్దెలనుదాటి, ధర్మసంబంధ మొడలి'' నపుడు కల్గెడు తీవ్ర భీభత్సరూపము యొక్క స్వరూపము గోచరిం చును ఆ స్వరూపము పూర్తిగా గోచరించిన గాని దానివెనుక దాగియున్న ధర్మముయొక్క విలువ స్పష్టముగా గోచరించదు.

తెల్లని లేమబ్బులలో నుండి యొక మెరపు మెరసిన కంటె నీలమేఘాచ్ఛాది తాకాశమున తళుక్కున యొక మెరపు మెరసినపుడు దాని కాంతి దిగంతములవరకు వ్యాపించి ప్రతివ్యక్తి చూపులో హత్తుకొని పోవునుకదా!

అందుచేతనే కాబోలు ధర్మవిచ్ఛిత్తి జరిగిన దని సామాన్యముగా నిరూపించక ఆ విచ్ఛిత్తి నెంతఎత్తునకు కొనిపోవలయునో అంత ఎత్తుకు కొనిపోయిరి

''కడలిలో గొండ యంతటి కరుడు లేచి
నది. సముద్రము హెూరున కదలి పెల్ల
గిల్లినది. తాడియెత్తున కెరటమొకడు
తరలి ప్రత్యంతమగు పర్వతము వలె''

అని వర్ణించినారు.

ఇతివృత్త మొక నీచసంఘటన మాధార ముగా తీసికొనబడినదైననూ అందు మూల ముగా చదువరి కధికముగా నొప్పికల్గించి చివరి కొక యుదాత్తవిషయమును స్ఫురింప చేసి అట్టిదానిని ప్రతిష్ఠించుటవలన నది మరింత బలముగా హత్తుకొని పోవుననికాబోలు రచయిత రంగారావుచే నట్టి నీచకార్యమును చేయించెను. ★

